సాక్షి మహబూబ్‌నగర్

సోమవారం । 16 । డిసెంబర్ । 2024



త్వరలోనే కార్పొరేషన్

పాలమూరు మున్సిపాలిటీ త్వరలోనే కార్పొరేషన్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వివరాలు 9లో ▸



ఉల్లం'ఘనులు'!

నిబంధనలు ఉల్లంఘించి తవ్వకాలు చేపడుతూ ఆదాయానికి గండికొడుతున్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.5 /11.8


వాతావరణం

ఉదయం మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది.

ఈ-చలాన్స్‌పై నజర్

జిల్లాలో విస్తృతంగా పోలీసుల తనిఖీలు

- ప్రతి పోలీస్ స్టేషన్ నుంచి ప్రత్యేక బృందాల ఏర్పాటు
- పెండింగ్ చలాన్స్ చెల్లించే విధంగా దృష్టి
- ఈ ఏడాది లక్షకుపైగా కేసుల్లో రూ.7 కోట్ల జరిమానా విధింపు
- ఇప్పటికే 2,141 కేసుల్లో రూ.97 లక్షలు వసూలు



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో ఈ ఏడాది నమోదైన ఈ-చలాన్, ఎంవీఐ యాక్ట్ పెండింగ్ కేసులలో వాహనదారుల నుంచి జరిమానాల వసూలుకు పోలీస్‌శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. వారం రోజులుగా ప్రతి పోలీస్‌స్టేషన్ నుంచి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఉదయం, సాయంత్రం వేళలలో తనిఖీలు చేపడుతున్నారు. ప్రధానంగా జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ పోలీసులతోపాటు వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీసులు వేర్వేరు బృందాలుగా పట్టణం నలువైపులా తనిఖీలు చేస్తున్నారు. ప్రతి వాహనం నంబర్‌పై పెండింగ్ ఈ-చలాన్స్ ఉన్నాయా.. లేదా అని పరిశీలించి ఉంటే ఆ మొత్తాన్ని చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నారు.

రెండేళ్లు ప్రత్యేక రాయితీలు

గతంలో రెండేళ్లపాటు ప్రభుత్వం అన్ని రకాల వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లపై ప్రత్యేక రాయితీలు కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ-చలాన్స్ అధికంగా ఉండటంతో వాహనదారుల నుంచి జరిమానాలు రాబట్టడం కోసం పోలీస్ శాఖ భారీ రాయితీలు ప్రకటించింది. ఈ మేరకు గతేడాది డిసెంబర్‌లో జిల్లాలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి.. పెండింగ్ చలాన్స్ వసూలు చేశారు. దీంతో కొందరు వాహనదారులు సైతం స్వచ్ఛందంగా పెండింగ్ చలాన్లు క్లియర్ చేసుకున్నారు. మరి ఈ ఏడాది కూడా వాహనదారుల నుంచి పెండింగ్ చలాన్లు వసూలు చేయడానికి ప్రత్యేక రాయితీలు కల్పిస్తారా.. లేదా.. అనేది వేచిచూడాల్సి ఉంది.

17 పోలీస్‌స్టేషన్ల పరిధిలో..

జిల్లాలోని 17 పోలీస్‌స్టేషన్ల పరిధిలో 1,49,142 కేసులు పెండింగ్‌లో ఉండగా వీటి నుంచి **రూ.6,94,88,795 జరిమానా వసూలు కావాల్సి ఉంది. ఇందులో మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి 7,641 కేసులు ఉండగా రూ.62,38,365 జరిమానాలు ఉన్నాయి. అలాగే** హన్వాడ పరిధిలో 2,959 కేసులకు గాను రూ.10,35,030, కోయిలకొండలో 1,500 కేసులకు రూ.4,22,750, నవాబ్‌పేటలో 1,502 కేసులకు రూ.10,90,560, మహమ్మదాబాద్‌లో 2,267 కేసులకు రూ.12,63,965, బాలానగర్‌లో 5,017 కేసులకు రూ.21,56,905, మిడ్జిల్‌లో 2,887 కేసులకు రూ.8,54,540, రాజాపూర్‌లో 6,261 కేసులకు రూ.25,14,430, భూత్పూర్‌లో 13,176 కేసులకు రూ.1,11,16,945 రాబట్టాల్సి ఉంది. అడ్డాకుల పరిధిలో 5,214 కేసులకు గాను రూ.26,24,540, మూసాపేటలో 8,850 కేసులకు రూ.48,17,995, దేవరకద్రలో 2,256 కేసులకు రూ.13,61,670, చిన్నచింతకుంటలో 1,664 కేసులకు రూ.3,90,865, మహబూబ్‌నగర్ వన్‌టౌన్‌లో 7,931 కేసులకు రూ.71,01,435, టూటౌన్‌లో 6,848 కేసులకు రూ.26,36,420, ట్రాఫిక్‌లో 6,183 కేసులకు రూ.1,48,27,835, జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 11,334 కేసులకు గాను రూ.90,34,545 జరిమానాలు పెండింగ్‌లో ఉన్నాయి.



మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ దగ్గర వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

రాయితీపై ఆదేశాలు రాలేదు..



జిల్లాలో వారం రోజుల నుంచి పెండింగ్ ఈ-చలాన్స్ క్లియర్ చేయాలనే ఉద్దేశంతో ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తున్నాం. గతేడాది పెండింగ్ ఈ-చలాన్స్‌పై రాయితీలు ఇచ్చినట్లు ఈసారి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. దీనిపై ప్రభుత్వంతోపాటు పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారు. జిల్లా పోలీస్ శాఖ నుంచి పెండింగ్ ఈ- చలాన్స్ క్లియర్ చేయడానికి తనిఖీలు ముమ్మరం చేస్తాం.

– వెంకటేశ్వర్లు, డీఎస్పీ

జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ-చలాన్ కేసులు, జరిమానాలు ఇలా..

మొత్తంలో పోలీస్‌స్టేషన్లు 17	ఈ-చలాన్ కేసులు 1,70,559	విధించిన జరిమానా (రూ.లలో) 7,92,41,590
ఇప్పటి వరకు జరిమానా చెల్లించిన కేసులు 21,417	వసూలైన నగదు (రూ.లలో) 97,52,795	
ఇంకా పెండింగ్‌లో ఉన్న చలాన్లు 1,49,142	వసూలు చేయాల్సిన జరిమానా (రూ.లలో) 6,94,88,795	

న్యూస్‌రీల్

రేపు జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: కల్వకుర్తిలో ఈ నెల 22న జరిగే 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్– 16, 18, 20 విభాగాల బాల, బాలికలు, పురుష, మహిళా క్రాస్‌కంట్రీ పరుగు పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపికలను మంగళవారం ఉదయం 9 గంటలకు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి శరత్‌చంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు తహసీల్దార్ ద్వారా కుల ధ్రువపత్రం, మున్సిపాలిటీ ద్వారా జనన పత్రంతో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సి.శ్రీనివాసులుకు రిపోర్టు చేయాలన్నారు. పూర్తి వివరాల కోసం సెల్ నం.94921 77535ను సంప్రదించాలని సూచించారు.

38,796 బస్తాల ధాన్యం రాక



నవాబుపేట: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు వరిధాన్యం భారీగా వచ్చింది. ఆదివారం 38,796 వేల బస్తాలకు పైగా ధాన్యం రావడంతో యార్డు మొత్తం కిక్కిరిసింది. కాగా.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కంటే ప్రైవేట్‌లో వ్యాపారులు ఎక్కువ ధర ఇస్తుండటంతో రైతులందరూ మార్కెట్‌కు ధాన్యం తీసుకువస్తున్నారు. మార్కెట్‌లో వరిధాన్యం క్వింటాల్ గరిష్టంగా రూ.2,747, కనిష్టంగా రూ.2,661 ధర లభించింది.

అప్రమత్తంగా ఉండాలి

- కొత్త రకం ఫ్లూ.. జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

పాలమూరు: ప్రపంచంలో కొన్ని దేశాలతో పాటు మన దేశంలోని పలు రాష్ట్రాల్లో ఫ్లూ లక్షణాలు ఉన్న కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ మేరకు ప్రజలు రద్దీగా ఉండొద్దని, ఫ్లూ లక్షణాలు ఉన్న వ్యక్తులు సురక్షిత దూరం పాటించడంతో పాటు ఎవరైనా అస్వస్థతగా భావిస్తే ఇంట్లో ఇతరులకు దూరంగా ఉండాలని సూచించారు. ఫ్లూ, ఇన్‌ఫ్లూయేంటా లాంటి ఇన్‌ఫెక్షన్ ఉన్న కేసులు పెరుగుతున్న క్రమంలో ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టనున్నారు. ప్రతి జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆర్‌టీపీసీఆర్ కిట్లు అందుబాటులో ఉంచి టెస్టుల సంఖ్య పెంచుతూ లక్షణాలతో వచ్చిన ప్రతిఒక్కరి నుంచి శాంపిల్స్ తీయాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు లేకపోయినా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. ప్రస్తుత కొత్త రకం ఫ్లూలో జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి, తలనొప్పితోపాటు కడుపునొప్పి వంటి లక్షణాలు ఉంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ కొత్త రకం వైరస్ శరీరంలోకి ప్రవేశించిన తర్వాత రోగ నిరోధక శక్తిని తగ్గించడంతోపాటు ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంది. జిల్లాలో ప్రజలు మాస్క్ వాడుతూ రద్దీ ప్రాంతాలకు దూరంగా ఉండాలని, జ్వరం, దగ్గు, జలుబు ఇతర లక్షణాలు ఉంటే తప్పక వైద్యుడి సలహాతో చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు.



భక్తజనసంద్రం మధ్య కదులుతున్న రథం

'పడమటి'కి పోటెత్తారు



ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

పడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన రథోత్సవం కనులపండువగా సాగింది. ముందుగా స్వామివారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి మేళతాళాలతో తేరుపై కూర్చోబెట్టారు. అనంతరం రథాన్ని బాలాంజనేయస్వామి ఆలయం వరకు లాగారు. రథోత్సవాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలే కాకుండా కర్ణాటక, హైదరాబాద్, పుణె, సోలాపూర్ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అంతకు ముందు మంత్రి కొండా సురేఖ ప్రభుత్వం తరఫున స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. – మక్తల్

చిన్నరాజమూరు.. భక్తజనఝురి

- ఆకట్టుకున్న స్వామివారి ప్రభోత్సవం
- వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

– దేవరకద్ర



– వివరాలు 8లో..

మహబూబ్‌నగర్‌ను కార్పొరేషన్ చేస్తాం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: త్వరలోనే మహబూబ్‌నగర్ మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను అధికారులు తయారు చేస్తున్నారన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ అప్‌గ్రేడ్ అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు వస్తాయన్నారు. అవసరమైతే ఎంపీ డీకే అరుణను సంప్రదించి వివిధ పథకాల కింద ఎక్కువ నిధులు రాబడతామన్నారు. ఇక నుంచి ప్రతి ఆదివారం ప్రభుత్వ వైద్య, విద్యా సంస్థలలో కాంగ్రెస్ పార్టీ తరఫున శ్రమదానం చేస్తామన్నారు. 'ఇది ప్రజా ప్రభుత్వమని, పాలకులం కాదు.. సేవకులం.. సీఎం రేవంత్‌రెడ్డి గతేడాది డిసెంబర్ 7న ప్రమాణ స్వీకారం సందర్భంగా ఇచ్చిన మాటకు అనుగుణంగా తామంతా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవ చేస్తున్నామ'ని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ పదవుల్లో ఉన్నవారు సైతం శ్రమదానం కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. వీలైనంత వరకు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రాజకీయం అంటే సేవ చేయడం, ప్రజల్లో మమేకమై వారి సమస్యల్ని పరిష్కరించడం.. అని ఆనాడే మహాత్మాగాంధీజీ చెప్పారన్నారు. అయితే గత పదేళ్ల బీఆర్‌ఎస్ హయాంలో ప్రజలను భయపెట్టడం, భయభ్రాంతులకు గురిచేయడం, దౌర్జన్యం చేయడం జరిగిందని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు, అధికారులు ఎలాంటి భయాందోళన లేకుండా ఎవరి పనులు వారు చేసుకుంటున్నారన్నారు. త్వరలోనే ముడా, మున్సిపల్ చైర్మన్లు కె.లక్ష్మణ్‌యాదవ్, ఎ.ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్‌తో పాటు పార్టీ నాయకులందరూ కలిసి ప్రతి వార్డులో పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నాయకులు సిరాజ్‌ఖాద్రీ, సీజే బెనహర్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

జడ్చర్ల టౌన్: సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి అన్నారు. ఆదివారం జడ్చర్లలో ఏర్పాటు చేసిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొద్దిరోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తీర్చాలన్నారు. గతేడాది సెప్టెంబర్ 13న అప్పటి టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష శిబిరానికి వచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సమస్యలు తీరడం లేదని ఆరోపించారు. అలాగే కేజీబీవీ కళాశాలల్లో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారని, వారు సమ్మెకు వెళ్తే ఇబ్బందులు తప్పవన్నారు. విద్యారంగంలోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, అప్పటి వరకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులన్నీ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శశిధర్, కృష్ణానాయక్, నర్సింహారెడ్డి, జగపతిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, తాహెర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి

నేటి ప్రజావాణి రద్దు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): గ్రూప్–2 పరీక్ష జరుగుతున్న నేపథ్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అధికారులు, గ్రూప్–2 పరీక్షల విధుల్లో ఉన్నందున ప్రజావాణిని రద్దు చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి కలెక్టరేట్‌కు ఎవరూ రావొద్దని ఆమె కోరారు.

నేడు మార్కెట్‌కు సెలవు

దేవరకద్ర: మండలంలోని చిన్నరాజమూర్ జాతర సందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం సెలవు ఇచ్చారు. తిరిగి మంగళవారం మార్కెట్‌లో లావాదేవీలు కొనసాగుతాయని, సోమవారం రైతులు ఎవరూ మార్కెట్‌కు ధాన్యం తీసుకురావొద్దని సంబంధిత అధికారులు తెలిపారు.

నేటినుంచి సీఎం కప్ సందడి



మెయిన్ స్టేడియంలో సీఎం కప్ క్రీడల్లో వాలీబాల్ ఆడుతున్న బాలికలు

- 36 క్రీడాంశాల్లో జిల్లాస్థాయి పోటీలు
- మెయిన్ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి
- హాజరుకానున్న వేలాది మంది విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్– 2024 క్రీడాపోటీలను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. గ్రామీణ క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా సీఎం కప్ క్రీడా పోటీలు జరుగుతున్నాయి. ఈ నెల 7, 8 తేదీల్లో గ్రామం, 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించారు. ఆయా పోటీల్లో వేలాది మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

4,500 మంది క్రీడాకారులు

సీఎం కప్‌లో భాగంగా జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో సోమవారం నుంచి ఈ నెల 20 వరకు జిల్లాస్థాయి క్రీడా పోటీలతోపాటు సెలక్షన్స్ నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాస్థాయిలో దాదాపు 4,500 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

- సోమవారం వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాస్కెట్‌బాల్, కిక్‌బాక్సింగ్‌తోపాటు నెట్‌బాల్, బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలు ఫైనల్ వరకు నిర్వహించనున్నారు.
- మంగళవారం హాకీ, స్విమ్మింగ్, రెజ్లింగ్, సైక్లింగ్, వుషూ, జూడో, హ్యాండ్‌బాల్, అత్యపత్య, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలు ఉంటాయి.
- బుధవారం ఆర్చరీ, టేబుల్ టెన్నిస్, లాన్‌టెన్నిస్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్, షూటింగ్, సెపక్‌తక్రా, కరాటే, రోయింగ్, స్క్వాష్, కనోయింగ్– కయాకింగ్, తైక్వాండో నిర్వహిస్తారు.
- గురువారం అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, యోగా, చెస్ బాక్సింగ్‌తోపాటు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాస్కెట్‌బాల్ ఫైనల్, క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నారు. జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడల్లో ప్రతిభకనబరిచిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.
- శుక్రవారం స్థానిక మెయిన్ స్టేడియంలో హ్యాండ్‌బాల్, వాలీబాల్ ఉమ్మడి జిల్లా పోటీలు నిర్వహించనున్నారు.

ప్రతిభచాటాలి..

సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీలు, ఎంపికలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఈ మేరకు డీవైఎస్‌ఓ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాస్థాయి క్రీడల నిర్వహణకు ప్రత్యేక కమిటీలు నియమించాం. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భోజన, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నాం. క్రీడాకారులు జిల్లాస్థాయిలో మెరుగైన ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలి.

– శ్రీనివాస్, జిల్లా యువజన,క్రీడల అధికారి

గ్రూప్–2 పరీక్షలు ప్రారంభం

- 9.30 గంటలకే మూసుకున్న కేంద్రాల గేట్లు
- ఆలస్యంగా వచ్చిన నలుగురు అభ్యర్థులకు అనుమతి నిరాకరణ
- పరీక్షలను పర్యవేక్షించిన కలెక్టర్, డీఐజీ, ఎస్పీలు



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్)/ మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో గ్రూప్–2 పరీక్ష ఆదివారం మొదటిరోజు ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 54 కేంద్రాలు ఏర్పాటు చేయగా 20,584 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంది. అయితే ఉదయం తొలి పేపర్‌కు 10,380 హాజరు కాగా.. 10,204 గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం రెండో పేపర్‌కు 10,314 హాజరు కాగా.. 10,270 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 8.30 గంటల నుంచి అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించిన అధికారులు 9.30 గంటలకు గేట్లు మూసి వేశారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లను అధికారులు చేపట్టడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు. జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల, బాలిక జూనియర్ కళాశాలల పరీక్ష కేంద్రాలకు 9.30 గంటల తర్వాత వచ్చిన నలుగురు అభ్యర్థులను అధికారులు అనుమతించకపోవడంతో వారు నిరాశగా వెనుదిరిగారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–1లో జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీ, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–2లో హిస్టరీ, పాలిటీ అండ్ సొసైటీ పరీక్ష జరిగింది. పరీక్షల్లో భాగంగా రెండోరోజు సోమవారం పేపర్–3లో ఎకనామిక్స్ అండ్ డెవలప్ మెంట్, మధ్యాహ్నం పేపర్–3లో తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఏర్పాటు అంశంపై పరీక్ష జరగనుంది.

పటిష్ట బందోబస్తు

రూరల్ పరిధిలోని జేపీఎన్‌సీఈ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని జోగుళాంబ జోన్– 7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ జానకి కలిసి సందర్శించి.. బందోబస్తు ఏర్పాట్లతోపాటు అభ్యర్థులను పరిశీలించారు. ఈ క్రమంలో ఓ గర్భిణి పరీక్ష రాయడానికి రాగా.. డీఐజీ జేపీఎన్‌సీఈ రోడ్డు నుంచి కళాశాల వరకు కారులో పంపించారు. అనంతరం డీఐజీ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద భద్రత కట్టుదిట్టంగా అమలు చేశామని, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. అలాగే ట్రాఫిక్ సమస్య లేకుండా నియంత్రించామని, అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి చొరవ చూపామని వివరించారు. ప్రతి కేంద్రం దగ్గర ప్రతి కేంద్రం దగ్గర ముగ్గురు సిబ్బందితో భద్రత కల్పించగా మిగిలిన అధికారులు పెట్రోలింగ్ చేస్తూ అన్ని కేంద్రాలను పర్యవేక్షించారన్నారు. పోలీసులు విస్తృతంగా ఏర్పాటు చేసి.. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూశామన్నారు. అలాగే ఎస్పీ జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు ఎన్టీఆర్, ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలు, పాలమూరు యూనివర్సిటీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా తనిఖీల్లో రూరల్ సీఐ గాంధీ నాయక్, ఎస్ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో తక్షశిల స్కూల్‌ను సందర్శిస్తున్న కలెక్టర్ విజయేందిర



జేపీఎన్‌సీఈ దగ్గర అభ్యర్థితో మాట్లాడుతున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ జానకి

పొరపాట్లకు తావులేకుండా..

టీజీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సజావుగా నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆమె ఉదయం దేవరకద్ర మండలం చౌదర్‌పల్లిలోని స్విట్స్ ఇంజినీరింగ్ కళాశాల, జిల్లాకేంద్రంలోని సంస్కార్, బ్రైట్, గ్రామర్ స్కూళ్లు, మధ్యాహ్నం స్థానిక తెలంగాణ చౌరస్తాలోని తక్షశిల, రెయిన్ బ్రో, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలల్లోని కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి పరీక్ష తీరును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. పరీక్ష ముగిసిన తర్వాత జవాబు పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు.

మార్మోగిన హనుమాన్ శరణుఘోష

- ముగిసిన మద్దిమడుగు దీక్షమాల విరమణ ఉత్సవాలు

అమ్రాబాద్: పదర మండలంలోని మద్దిమడుగు పబ్బతి అంజనేయస్వామి దీక్షమాల విరమణ ఉత్సవాలు ఆదివారం మగిశాయి. ఈ నెల 11 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు.. ఐదు రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. వేలాది మాల ధారణ భక్తులు 41 రోజుల కఠోర దీక్షల అనంతరం ఉత్సవాల్లో దీక్ష విరమణ పొందారు. పవనసుతా పాహిమాం, అంజనిపుత్ర వాయునందన, కాపాడయ్యా కరుణించయ్యా అంటూ భక్తులు స్వామిని స్తుతించిన తీరుతో మద్దిమడుగు క్షేత్రం పులకించిపోయింది. ఉత్సవాల ముగింపు సందర్భంగా గాయత్రి మహా యజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి గవ్యాంతర పూజల అనంతరం సమీప కృష్ణానది నుంచి తెచ్చిన 108 కలశాలు, గోదావరి నుంచి తెచ్చిన 40 కలశాలతో స్వామి వారికి జలాభిషేకం, కుంభాభిషేకం చేశారు. అనంతరం యజ్ఞశాలలో పండితులు నీలకంఠ శాస్త్రి, వీరయ్యశర్మల బృందం వేదమంత్రోచ్ఛారణలతో యజ్ఞం జరిపారు. ముందుగా మన్యుసూక్త హోమం, నవగ్రహాలను స్తుతించారు. వేదమంత్రాలు, భక్తి పాటలు, హనుమాన్ శరణుఘోషతో మద్దిమడుగు క్షేత్రం మార్మోగింది. యజ్ఞం అనంతరం ఉత్సవ మూర్తిని ఆలయం చుట్టూ ఊరేగించారు. యాగశాలలో మహా పూర్ణాహుతి అనంతరం అవభృతం స్నానం చేయించి అష్టాదశ కలశాలు, నాగవల్లిదళం (తమలపాకులు), పుష్పాలంకరణ నిర్వహించారు.

⇨ ఉత్సవాల్లో కలెక్టర్ బదావత్ సంతోష్, అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ, ఆయన సతీమణి డా.అనురాధ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు కలెక్టర్, ఎమ్మెల్యేను శేషవస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాములునాయక్, ఈఓ రంగాచారి తదితరులు పాల్గొన్నారు.


హనుమద్ గాయత్రి యజ్ఞంలో పాల్గొన్న భక్తులు


అష్టాదశ కలశాలను తీసుకుస్తున్న వేదపండితులు


అగ్నిగుండం వద్ద భక్తుల దాసంగాలు

చిన్నరాజమూరు.. భక్తజనఝరి


అంజన్న దర్శనానికి బారులుదీరిన భక్తులు

దేవరకద్ర: చిన్నరాజమూరు ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు పోటెత్తారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అంజన్న నామస్మరణతో మార్మోగింది. మొక్కుబడి ఉన్న భక్తులు కల్యాణకట్టలో తలనీలాలను సమర్పించారు. అదే విధంగా కుటుంబ సమేతంగా దాసంగాలు పెట్టారు. మరికొందరు గండ జ్యోతులతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు. దాదాపుగా అర కిలోమీటర్ మేర బారులుదీరి స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం వారు లడ్డూ ప్రసాదాల విక్రయాల కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కో లడ్డూ రూ. 15, పులిహోర పాకెట్ రూ. 15 చొప్పున విక్రయించారు. ఆర్టీసీ వారు జాతరకు ప్రత్యేకంగా బస్సులను నడిపారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి


చిన్నరాజమూర్‌లో అశ్వవాహనంపై ఊరేగుతున్న అంజన్న


స్వామి వారికి దాసంగాలు పెడుతున్న భక్తులు

వైభవంగా ప్రభోత్సవం..

ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున స్వామివారిని అశ్వవాహనంపై ఊరేగించారు. అనంతరం జాతర మైదానంలో ప్రభోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేలాది భక్తులు ప్రభోత్సవంలో పాల్గొని భక్తిపారవశ్యంతో తన్మయం చెందారు. స్వామివారిని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ముందుగా దేవస్థానం వారు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యేకు ప్రసాదాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంజల్‌రెడ్డి, కొకుంట్ల రాఘవేందర్‌రెడ్డి, కురుమూర్తి దేవస్థానం కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కతలప్ప, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

- బ్రహ్మోత్సవాల్లో ప్రధానం ఘట్టం అయిన స్వామివారి రథోత్సవాన్ని సోమవారం తెల్లవారుజామున నిర్వహించనున్నారు. దీంతో ఒకరోజు ముందుగానే భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. తెల్లవారుజామున 4 నుంచి 6గంటల వరకు జరిగే రథోత్సవానికి దేవస్థానం వారు అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామివారి రథాన్ని సుందరంగా ముస్తాబు చేశారు.


స్వామివారి ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవం.. ఆదిశిలా వాసుడి రథోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- మార్మోగిన గోవింద నామస్మరణ


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలో స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా వేదపండితులు రమేషాచారి, మధుసూదనాచారి, ప్రసన్నాచారి, రవిచారి, ధీరేంద్రాదాసుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను భాజాభజంత్రీలతో ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు. లక్ష్మీ సమేతుడైన శ్రీనివాసుడిని ప్రత్యేకంగా అలంకరించిన రథంపైకి చేర్చి పూజలు నిర్వహించారు. భక్తులు గోవింద నామస్మరణ చేస్తుండగా.. రథం ముందుకు కదిలింది. ఆదిశిలా క్షేత్ర నివాసుడి రథోత్సవాన్ని తిలకించేందుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి వేలాది మంది భక్తులు హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.


స్వామివారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు


ఎడ్లబండ్లపై మల్దకల్‌కు చేరుకుంటున్న భక్తులు

మొక్కులు తీర్చుకున్న భక్తులు

ఆదిశిలా క్షేత్రం గోవింద నామస్మరణతో మార్మోగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవానికి భక్తులు భారీగా తరలిరావడంతో మల్దకల్ గ్రామం జనసంద్రమైంది. ఆలయం చుట్టూ 5 కి.మీ. మేర ఎక్కడ చూసినా భక్తులు కనిపించారు. ట్రాక్టర్లు, ఆటోలు, జీపులు, ఎడ్లబండ్లపై భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి దాసంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోలీసులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం వలంటీర్లు, ఎస్వీఎస్ సేవాసమితి నిర్వహకుడు అభిలాష్ ఆధ్వర్యంలో 60 మంది మహిళలు తమ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం గద్వాల డిపో నుంచి 20 ప్రత్యేక బస్సులను నడిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి, నాయకులు తిమ్మారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నరేందర్, బాబురావు, వెంకటన్న అరవిందరావు, నాగరాజు శర్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్



గద్వాల క్రైం: తాళం వేసిన షెట్టర్లను ధ్వంసం చేసి చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి రూ.72వేలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీను తెలిపారు. ఆదివారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికారాబాద్ జిల్లాకు చెందిన కావలి సురేందర్ (శ్రీధర్) రెండు నెలల క్రితం క్రిష్ణవేణి చౌరస్తాలోని కృష్ణారెడ్డి మెడికల్ దుకాణంలో షెట్టర్ ధ్వంసం చేసి రూ.లక్ష నగదును అపహరించాడు. కేసు నమోదు చేసిన పట్టణ పోలీసులు విచారణ చేపట్టారన్నారు. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అతడిని సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టగా నేరం అంగీకరించాడు. నిందితుడిపై పలుస్టేషన్లలో మూడు కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు. పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్, సాంకేతిక విభాగ సిబ్బంది చంద్రయ్య, ఇస్మాయేల్ కేసును ఛేదించడంలో కృషి చేశారన్నారు. నిందితుడుని గద్వాల కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

పర్సు అప్పగింత



కొత్తకోట రూరల్: ఇద్దరు యువకులు బైక్‌పై వెళ్తుండగా దొరికిన పర్సును పోలీసుల సహాయంతో పోగొట్టుకున్న వ్యక్తికి అప్పగించారు. ఈ ఘటన ఆదివారం కొత్తకోటలో చోటుచేసుకుంది. వివరాలు.. పెబ్బేరు మండలం రంగపూర్‌కి చెందిన కావలి శివ, మహేందర్ బైక్‌పై కొత్తకోటకు వెళ్తున్నారు. బైపాస్ సమీపంలో మదర్ థెరిస్సా జంక్షన్ వద్ద రోడ్డుపై వారికి పర్సు దొరికింది. అందులో కొంత నగదుతో పాటు ఏటీఎం, క్రెడిట్ కార్డులున్నాయి. వాటిని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఏఎస్ఐ రామకృష్ణ పర్సులో ఉన్న అడ్రస్ ఆధారంగా హైదరాబాద్‌కు చెందిన పవన్‌కుమార్‌గా గుర్తించారు. కారులో బెంగుళూర్ వెళ్తుండగా డ్రైవింగ్ మారే సమయంలో పర్సు కింద పడిపోవడంతో అతడిని పర్సు అప్పగించారు.

కల్యాణ వైభోగమే..


- మన్యంకొండలో కనులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


అలంకరణలో స్వామి, అమ్మవార్లు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారి కల్యాణ మహోత్సవం కనులపండువగా జరిగింది. ప్రతినెల పౌర్ణమి రోజున స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శోభాయమానంగా అలంకరించిన పల్లకీలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గర్భాలయం నుంచి దేవస్థానం సమీపంలోని మండపం వరకు మేళతాళాలు, అర్చకుల వేదమంత్రోచ్ఛారణల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం కల్యాణ మహోత్సవాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్తజనావళి తిలకిస్తుండగా పురోహితుల మంత్రోచ్ఛారణలు, సన్నాయి వాయిద్యాల మధ్య జీలకర్ర, బెల్లం .. మంగళసూత్రధారణ, తలంబ్రాల కార్యక్రమం జరిగింది. కల్యాణం జరిగిన తర్వాత స్వామి, అమ్మవార్లను మళ్లీ పల్లకీలో గర్భాలయానికి తీసుకెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రంగురంగుల పూలు, వివిధ ఆభరణాల అలంకరణలో స్వామి, అమ్మవార్లు భక్తకోటికి దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి పాల్గొన్నారు.



తాళిబొట్టును చూపుతున్న ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్

గ్రూప్–2లో 'పాలమూరు' ప్రశ్నలు


137. Darshanam Mogulaiah, the Padma Shri recipient, is known for revitalizing :
(1) Musical instrument-Dolu (2) Yakshagana
(3) Musical instrument-Kinnera (4) Perini dance in Telangana
పద్మశ్రీ అవార్డు గ్రహీత, దర్శనం మొగులయ్య, దీనిని పునరుజ్జీవింపచేయడానికి చేసిన కృషికి ప్రసిద్ధి :
(1) డోలు-సంగీత వాయిద్యం (2) యక్షగానం
(3) కిన్నెర-సంగీత వాయిద్యం (4) తెలంగాణాలో పేరిణి నృత్యం

దర్శనం మొగులయ్యపై వచ్చిన ప్రశ్న

జడ్చర్ల టౌన్: టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన గ్రూప్–2 పరీక్ష ప్రశ్నపత్రంలో పాలమూరుకు చోటు దక్కింది. ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్ష ప్రశ్నపత్రంలో జతపరుచుము అన్న దాంట్లో తెలంగాణలో పేరుగాంచిన గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం, పిల్లలమర్రి ఎరకేశ్వర ఆలయాలకు చోటు దక్కింది. అలాగే లింగాల మండలం అవుసలికుంట గ్రామానికి చెందిన పన్నెండు మెట్ల కిన్నెర వాయిద్య కళాకారుడు దర్శనం మొగులయ్యపై మరో ప్రశ్న వచ్చింది. దీంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


Match the following temples with the places where they are located :

Temple		Place
A. Nagareswara Temple	I.	Nandikandi
B. Erakesvara Temple	II.	Vemulavada
C. Rameshvara Temple	III.	Gangapuram
D. Chennakesava Swami Temple	IV.	Pillalamarri

Choose the correct answer :
(1) A-II; B-IV; C-I; D-III (2) A-III; B-I; C-IV; D-II
(3) A-IV; B-III; C-II; D-I (4) A-I; B-II; C-III; D-IV

కింది దేవాలయాలను అవి ఉన్న ప్రాంతాలతో జతపరుచుము :

దేవాలయం		ప్రాంతం
A. నగరేశ్వర దేవాలయం	I.	నందికంది
B. ఎరకేశ్వర దేవాలయం	II.	వేములవాడ
C. రామేశ్వర దేవాలయం	III.	గంగాపురం
D. చెన్నకేశవ స్వామి దేవాలయం	IV.	పిల్లలమర్రి

సరైన సమాధానం ఎంచుకొనుము :
(1) A-II; B-IV; C-I; D-III (2) A-III; B-I; C-IV; D-II
(3) A-IV; B-III; C-II; D-I (4) A-I; B-II; C-III; D-IV

గ్రూప్-2 ప్రశ్నపత్రంలో జతపరుచుము దాంట్లో ఎరకేశ్వర ఆలయం పిల్లలమర్రి, చెన్నకేశవస్వామి ఆలయం గంగాపురం ఉన్న దృశ్యం

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ

కోస్గి: తిమ్మాయపల్లి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆంజనేయ స్వామి ఆలయంలో హుండీని పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థుల కథనం మేరకు.. ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు కానుకలు వేసేందుకు హుండీని ఏర్పాటు చేశారు. 13 సంవత్సరాలుగా హుండీని తీయకుండా ఉంచారు. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి హుండీని పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం కొందరు గ్రామస్థులు గమనించి పోలీసులకు ఫిర్యాదుకు చేశారు. సుమారు రూ.50వేలకు పైగా నగదు ఉండవచ్చని గ్రామస్థులు భావిస్తున్నారు.

మునగ సాగులో మెళకువలు

కొత్తకోట రూరల్: అత్యంత విలువైన పోషకాలు మునగ సొంతం. మునగ కాయలు, ఆకులు, పూల కోసం ఈ పంట దేశం, రాష్ట్రంలో సాగు చేయబడుతున్నది. విత్తన జిగురు, నూనె విత్తనాలు వివిధ ఔషధ పరిశ్రమలలో వాడతారు. కేవలం 20 గ్రాముల మునగ ఆకులు ఏ, సీ విటమిన్లను అందిస్తాయి. 100 గ్రాములు ఉడకబెట్టిన ఆకులతో వ్యక్తికి రోజూ కావల్సిన కాల్షియం, 75శాతం ఇనుము, ప్రోటీన్, ఇతర అమైనో ఆమ్లాలు అందిస్తాయి. అందుకే కూరగాయ పంటగా మునగకు ఆదరణ పెరుగుతున్నది. బహువార్షిక రకాల పూత, కాతకు ఎక్కువ సమయం తీసుకోవడంతో దిగుబడులు తక్కువ. ఇటీవల పరిశోధనతో ఏకవార్షిక రకాలు అంటే ఆరు నెలల్లోనే పూతకు, కాతకు వచ్చే రకాలు అందుబాటులోకి వచ్చాయి. విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయి. మేలైన దిగుబడికి సాగులో మెళకువలు పాటించాలి.

నేలలు: అన్నిరకాల నేలల్లో మునగ సాగు చేసుకోవచ్చు. 6.5–8 ఉదజని సూచిక కలిగిన ఇసుక రేగడి నేలలు అనుకూలం.

పంట సీజన్: జూలై నుంచి మొదలుకొని అక్టోబర్ వరకు విత్తుకోవచ్చు. సంవత్సరంలో జనవరి–ఏప్రిల్ మధ్య పూతకు వస్తుంది.

విత్తనమోతాదు: ఎకరాకు 200 గ్రాముల విత్తనం అవసరం. ఒక గుంతకు రెండు విత్తనాల చొప్పున 2.5–3 సెం.మీ లోతులో వేయాలి. లేదంటే ముందుగా పాలీ బ్యాగులలో పెంచి, 35–40 రోజుల సమయంలో గుంతలలో నాటాలి. గుంతలను 2–2.5 మీటర్ల దూరంలో 45 సెం.మీ పొడవు, 45 సెం.మీ వెడల్పు, 45 సెం.మీ లోతులో తవ్వాలి. ఒక్కో గుంతకు 15 కిలోల చొప్పున కంపోస్టు లేదా పశువుల ఎరువు వేయాలి.

అంతర సేద్యం: ఒక నెల వ్యవధిలో మొలకలు పరిశీలించి, మొలకలు లేని గుంతల్లో మళ్లీ విత్తనాలు నాటాలి.

ఎరువులు: విత్తిన మూడు నెలల్లో గుంతకు 45:15:30 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్‌ను ఇచ్చే ఎరువులు వేయాలి. ఆరు నెలలకు పంట పూత సమయంలో మరో దఫాగా 45 గ్రాముల నత్రజని ఒక్కో గుంతలో వేయాలి. విత్తిన మూడో రోజు మొదటి తడిని, ఆ తర్వాత 10–15 రోజుల వ్యవధిలో నీటి తడులివ్వాలి.

సస్యరక్షణ: కాయ పండు ఈగ యాజమాన్యం: నాటిన 150,180, 210 రోజుల్లో ఎకరాకు 80 గ్రాముల 'థయోమిథాక్సోమ్ 25 డబ్ల్యూజీ'ని నేలలో వేయాలి. ఎకరాకు 10 కుళ్లిన టమాటాతో కూడిన ఫ్రూట్ టాప్ 500 లీటర్ల నీటిలో కలిపి వేయాలి. స్పైనోశాడ్ 45 ఎస్సీని లీటర్ల నీటిలో 0.3 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలి. మరో దఫా ఎకరాకు 200 లీటర్ల నీటిలో 500 గ్రాముల ప్రొఫెనోఫాస్ కలిపి పిచికారీ చేయాలి.

బొంత పురుగు యాజమాన్యం: మునగ కాండంపై గుంపులుగా చేరి, బెరడును తొలిచి తింటాయి. ఆకులను తొలిచి వేస్తాయి. ఆకు విపరీతంగా రాలిపోతుంది. పురుగు గుడ్లను, లార్వాలను సేకరించి ఏరివేయాలి.

కార్సి పంట: మొదటి కాయ కోత తర్వాత భూమట్టం నంచి 90 సెం.మీ ఎత్తులో కత్తిరించాలి. 4,5 నెలల్లో చెట్టు కాపుకొస్తుంది. మూడు సంవత్సరాల వరకు కార్సి పంట తీసుకోవచ్చు. కత్తిరించిన వెంటనే మొక్కకు 45,15,30 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. 30 గ్రాముల చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేయాలి. ప్రతి సంవత్సరం 25 కిలోల చొప్పున బాగా చివికిన పశువుల ఎరువు వేయాలి.

దిగుబడి: హెక్టారుకు 50–55 టన్నుల కాయలు, సాలీనా చెట్టుకు 220 మునగ కాయల దిగుబడి వస్తుంది.


డా. పిడిగెం సైదయ్య, అసోసియేట్ డీన్, ఉద్యాన కళాశాల, మోజర్ల

ఏక వార్షిక మునగ రకాలు:

కేఎం1: విత్తనాలతో సాగు చేయాలి. సాలీనా ఒక చెట్టుకు సరాసరిన 400–500 కాయలు వస్తాయి. నాటిన ఆరు నెలలకే కాపుకొస్తుంది.

పీకేఎం–1: ఈ రకం విత్తిన 5–6 నెలలకు పూతకొస్తుంది. 7–8 నెలల్లో కోతకొస్తుంది. మార్చి–ఆగస్టు మధ్యలో దిగుబడి ఎక్కువ.

పీకేం–2: ఇది సంకర రకం. విత్తనాల ద్వారా సాగు చేసుకోవాలి. నాటిన ఆరు నెలల్లో కాత కొస్తుంది. వివిధ పంటల సరళిలో సాగుకు అనుకూలం.

చిన్న, సన్నకారు రైతులకు లాభం:

⇨ ఏకవార్షిక మునగ సాగుకు తక్కువ మొత్తంలో నీరు అవసరం.


వీపనగండ్ల శివారులో ఓ రైతు సాగు చేసిన మునగపంట

⇨ ఎక్కువ మంది కూలీల అవసరం లేదు. కుటుంబ సభ్యులే వివిధ పనులు పూర్తి చేసుకోవచ్చు.

⇨ ఎరువులు, పురుగు మందులు తక్కువే అవసరం.

⇨ ఒక హెక్టారు కంటే తక్కువే సాగు విస్తీర్ణం. కాబట్టి మునగ కాయలను సులభంగా, తక్కువ కాలంలోనే మార్కెట్లకు తరలించవచ్చు.

అధిక సాంద్ర పద్ధతిలో సాగు: మొక్కల సంఖ్య పెంచటం ద్వారా అధిక దిగుబడిని పొందే అధునాతన పద్ధతి 'అధిక సాంద్ర పద్ధతిలో సాగు''. సాధారణ పద్ధతికి బదులుగా గుంతలు 1.5 మీటర్ల వరుసలు, ఒక మీటరు దూరంలో వరుసలో మొక్కలు నాటేలా తీసుకోవాలి.

విత్తనోత్పత్తి: రైతులు సొంతంగా ఈ రకాలలో విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. పూత సమయంలో, వర్షాలు రాకుండా ఉండే విధంగా విత్తన పంట కోసం విత్తనం నాటాలి. సంవత్సరం చెట్టుకు 200–250 కాయలు వస్తాయి. ఒక్కో కాయలో 10–13 విత్తనాలుంటాయి. అంటే ఒక్కో చెట్టుకు 600 గ్రాముల నుంచి 1000 గ్రాముల వరకు విత్తన దిగుబడి ఉంటుంది. ఒక కిలో విత్తనానికి రెండు గ్రాముల బావిస్టిన్ విత్తనశుద్ధి చేసి నిల్వ ఉంచుకోవాలి. పాలిథీన్ బ్యాగులలో సీడ్ ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి.

జగన్ హయాంలో
జీఎస్‌డీపీ జోరు

రూ.1.94 లక్షల కోట్లు పెరిగిన రాష్ట్ర స్థూల ఉత్పత్తి

ఆర్‌బీఐ నివేదికలో వెల్లడి



- స్థిర ధరల ఆధారంగా ఐదేళ్లలో జీఎస్‌డీపీ 31.04 శాతం వృద్ధి
- వైఎస్సార్‌సీపీ హయాంలో వ్యవసాయ రంగం వృద్ధి 16.46 శాతం
- రెండేళ్లు కోవిడ్ సంక్షోభంలోనూ తయారీ రంగం 58.39 శాతం వృద్ధి
- ఐదేళ్లలో పారిశ్రామిక రంగం 46.62%.. నిర్మాణ రంగంలో 41.50% వృద్ధి
- విద్య, వైద్యం, తాగునీరు, సంక్షేమం, పారిశుద్ధ్యం, గ్రామీణ, పట్టణాభివృద్ధి, పౌష్టికాహారానికి అత్యధిక ప్రాధాన్యమిస్తూ వైఎస్ జగన్ 'సామాజిక' అడుగులు
- సామాజిక రంగంపై రూ.5.22 లక్షల కోట్లు వెచ్చించిన జగన్
- బాబు హయాంలో తలసరి ఆదాయం రూ.1,54,031
- జగన్ పాలనలో రూ.2,42,479కి పెరిగిన తలసరి ఆదాయం
- టీడీపీ హయాంలో తలసరి విద్యుత్ లభ్యత గంటకు 1,289.4 కిలోవాట్
- వైఎస్సార్‌సీపీ హయాంలో తలసరి విద్యుత్ లభ్యత గంటకు 1,623.0 కిలోవాట్
- వైఎస్ జగన్ పాలనలో రూ.1.35 లక్షల కోట్లు అదనంగా పెరిగిన రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

విజన్ 2047..
ఓ డొల్ల డాక్యుమెంట్

మరోసారి చంద్రబాబు పబ్లిసిటీ స్టంట్: 'ఎక్స్'లో వైఎస్ జగన్ ధ్వజం

- బాబు పాలనలో మొత్తం విజన్లు.. చరిత్రలో నిలిచిపోయే పని ఒక్కటైనా చేశారా?
- ప్రభుత్వ రంగంలో ఒక్క మెడికల్ కాలేజీ అయినా కట్టారా? స్కూళ్లు, ప్రభుత్వ ఆస్పత్రులను బాగు చేశారా? రైతులకు అండగా నిలిచారా?
- మరి ఇంకెందుకు ఈ విజన్ డాక్యుమెంట్లు?
- రాష్ట్రం, ప్రజల అవసరాలకు చోటెక్కడ? వాస్తవిక దృక్పథం ఏది?
- ఆయన దృష్టంతా ప్రజలను మోసం చేయడం, మాయ చేయడంపైనే
- విజన్ డాక్యుమెంట్లు పేరిట ఇలా అబద్ధాలాడితే జైలుకో, ఆస్పత్రికో పంపిస్తామన్న నాటి స్విట్జర్లాండ్ ఆర్థిక మంత్రి పాస్కల్
- బాబు 14 ఏళ్ల పాలనలో రెవెన్యూ లోటు మినహా ఎన్నడైనా మిగులు ఉందా?
- ప్రభుత్వ ఆస్తులను అమ్మేసి.. సంపదను ఆవిరి చేసే సంస్కృతి చంద్రబాబుది
- వైఎస్సార్ సీపీ అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను నీరుగారుస్తూ.. రద్దు చేస్తున్నారు
- మేం సృష్టించిన ఆస్తులను తన మనుషులకు అమ్మేయడానికి బాబు ప్రయత్నిస్తున్నారు
- పేదలను మరింత పేదవాళ్లుగా తయారు చేస్తున్న చంద్రబాబు

సాక్షి, అమరావతి: విజన్ 2047 పేరిట ప్రజలను మభ్యపుచ్చి మాయ చేసేందుకు సీఎం చంద్రబాబు మరోసారి పబ్లిసిటీ స్టంట్‌కు దిగారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. చంద్రబాబు పత్రంలో రాష్ట్రం, ప్రజల అవసరాలకు చోటే లేదని ధ్వజమెత్తారు. వాస్తవిక దృక్పథం అంతకన్నా లేదన్నారు. ఆయన దృష్టి ఎప్పుడూ ప్రజలు తనకిచ్చిన ఐదేళ్లలో మేనిఫెస్టో హామీల అమలుపై ఉండదని దుయ్యబట్టారు. ఎప్పుడూ ప్రజలను మోసం చేయడం, మాయ చేయడం మీదనే ఆయన ధ్యాసంతా ఉంటుందని మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వైఎస్ జగన్ పోస్టు చేశారు. అందులో ఇంకా ఏమన్నారంటే...

- 1998లో కూడా చంద్రబాబు విజన్–2020 పేరిట డాక్యుమెంట్ విడుదల చేశారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో అదొక చీకటి అధ్యాయం. రైతుల ఆత్మహత్యలు, ఉపాధి లేక వలసలు, ఉద్యోగాలు లేక నిరుద్యోగుల అష్టకష్టాలు.. వీటన్నింటినీ దాచేసి చంద్రబాబు తన విజన్ చుట్టూ నడిపించిన ప్రచారం అంతా ఇంతా కాదు. ప్రైవేటీకరణ పేరుతో విలువైన ప్రభుత్వ ఆస్తులను పప్పు బెల్లాల మాదిరిగా తన మనుషులకు కట్టబెట్టి అవినీతికి పాల్పడ్డారు. నాడు స్విట్జర్లాండ్‌కు చెందిన ఆర్థిక మంత్రి పాస్కల్ హైదరాబాద్‌లో పర్యటించిన సందర్భంగా విజన్ డాక్యుమెంట్ల పేరిట ఇలా అబద్ధాలు చెప్పేవారిని తమ దేశంలో జైలుకో లేకపోతే ఆస్పత్రికో పంపిస్తామని కామెంట్ చేశారు. చివరకు ప్రజలు కూడా విజన్ 2020 కాదు.. 420 అంటూ చంద్రబాబు తీరును దుయ్యబట్టారు.
- 2014లో కూడా చంద్రబాబు విడుదల చేసిన విజన్ 2029 డాక్యుమెంట్ ప్రచార ఆర్భాటంగానే మిగిలిపోయింది. తన పరిపాలనలో మొత్తం విజన్లు ప్రకటించిన చంద్రబాబు చిరస్థాయిగా నిలిచిపోయే పని ఒక్కటైనా చేశాడా? ప్రభుత్వానికి మేలు జరిగే విధంగా ఒక్క ప్రాజెక్టు అయినా కట్టాడా? ఒక్క పోర్టుగానీ ఫిషింగ్ హార్బర్లుగానీ కట్టాడా? ప్రభుత్వ రంగంలో ఒక్క మెడికల్ కాలేజీ అయినా కట్టారా? స్కూళ్లు బాగు చేశారా? ప్రభుత్వ ఆస్పత్రులను బాగు చేశారా? వ్యవసాయ రంగాన్ని బాగు చేశారా? చెప్పుకోదగ్గ ఉద్యోగాలు ఏమైనా ఇచ్చారా? మానవ వనరుల అభివృద్ధి మీద, యువత భవిష్యత్తు మీద ఒక్క పైసా అయినా ఖర్చు చేశారా? ఒక్కటంటే ఒక్కటి కూడా చేయలేదు. మరి ఇంకెందుకు ఈ విజన్ డాక్యుమెంట్లు?



తానిచ్చిన మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ సహా ఇతర హామీలకు తూట్లు పొడుస్తూ మోసాలు, అబద్ధాలతో ప్రజలకు నమ్మకద్రోహం చేస్తున్న చంద్రబాబు ఇప్పుడు మళ్లీ విజన్ 2047 పేరిట డాక్యుమెంట్ విడుదల చేయడం మరో డ్రామా, స్టంట్ కాదా? ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను గంగలో కలిపిన పాలకుడిని చీటర్ అంటారు. అంతేగానీ విజనరీ అంటారా?

పాలనలో, ఆయన 14 ఏళ్ల పరిపాలనలో ఎప్పుడూ రెవెన్యూ లోటే కనిపిస్తుందన్న మాట వాస్తవం కాదా? మరి ఇంకెక్కడి సంపద సృష్టి? ఆయన పాలించిన ఏ ఒక్క సంవత్సరంలోనైనా రెవెన్యూ మిగులు ఉందా? ఆయనకు సంపద సృష్టించే శక్తి లేదు. సమగ్ర ఆర్థిక నియంత్రణ కూడా లేదు. ఇప్పుడు విజన్ 2047 ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లు చేస్తానంటూ చంద్రబాబు చెప్పడం కట్టుకథ కాదా?

ఏ రాష్ట్రంలోనైనా కాలం గడుస్తున్న కొద్దీ ఆర్థిక వ్యవస్థ పెరుగుతూ వస్తుంది. ఇప్పటి నుంచి వచ్చే 10 ఏళ్లు తీసుకున్నా లేక గతంలో 10 ఏళ్ల లెక్కలు తీసుకున్నా ఏ రాష్ట్రమైనా, ఏ దేశమైనా ద్రవ్యోల్బణం వల్ల, సహజంగా వచ్చే పెరుగుదల వల్ల వృద్ధి చెందుతూ ఉంటుంది. కానీ సంపద సృష్టి ఎప్పుడూ చేయని చంద్రబాబు.. ఎప్పుడూ ప్రభుత్వ ఆస్తులను అమ్మేసి సంపదను ఆవిరి చేసే ఈ బాబు.. ఆ పెరుగుదల తన వల్లే అని చెప్పుకుంటూ ఉంటారు. అందుకే ఈ మోసగాడిని మాత్రమే 420 అని అంటారు.

మేం ఏం చేశామో చూడండి..

- రాష్ట్రంలో నెలకొన్న సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం చూపుతూ అసమానతలు రూపుమాపి అందరికీ సమాన అవకాశాలు కల్పించి, సుస్థిర అభివృద్ధి దిశగా వైఎస్సార్‌సీపీ హయాంలో అనేక చర్యలు తీసుకున్నాం. విద్యారంగంలో సీబీఎస్‌ఈ, ఐబీ, పిల్లలకు ట్యాబ్‌లు, వ్యవసాయంలో ఆర్బీకే వ్యవస్థ, ఈ క్రాప్, ఫామ్‌గేట్ వద్దే మద్దతు ధరకు పంటల కొనుగోళ్లు, నాడు – నేడు ద్వారా ఆసుపత్రుల బలోపేతం, కొత్తగా ప్రభుత్వ రంగంలో 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం, ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్‌లు, ఉపాధి కల్పనా రంగంలో మైక్రోసాఫ్ట్ ద్వారా నైపుణ్యాభివృద్ధి, ఎడెక్స్‌తో ఒప్పందం ద్వారా అత్యాధునిక కోర్సుల్లో శిక్షణ లాంటి పలు విప్లవాత్మక కార్యక్రమాలు చేపట్టాం.
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఈ పథకాలు, కార్యక్రమాలను చంద్రబాబు నీరు గారుస్తున్నారు, రద్దు చేస్తున్నారు. విద్య, వ్యవసాయం, ఆరోగ్యం, ఉపాధి కల్పన, సుపరిపాలనలో తీసుకున్న విప్లవాత్మక సంస్కరణలు ఎన్నింటినో దెబ్బ తీశారు. ప్రభుత్వ రంగంలో సృష్టించిన ఆస్తులను తన మనుషులకు అమ్మేయడానికి ప్రయత్నిస్తున్నారు.
- సమాజంలో అట్టడుగు వర్గాలకు చేయూతనిచ్చి వారి జీవన ప్రమాణాలు పెంచి పేదరికాన్ని నిర్మూలించే దిశగా గత ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలన్నింటినీ తీసివేసి పేదలను మరింత పేదవాళ్లుగా చంద్రబాబు తయారు చేస్తున్నారు. మరి చంద్రబాబుకు విజన్ ఉందని ఎలా అనుకుంటారు?

స్థిరంగా కొనసాగుతున్న
అల్పపీడనం

- నేడు తీవ్ర అల్పపీడనంగా మారే ఛాన్స్
- 18న తమిళనాడులో తీరం దాటే అవకాశం
- రేపు దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా మోస్తరు వానలు

సాక్షి, విశాఖపట్నం: దక్షిణ అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. రాబోయే 24 గంటల్లో ఇది బలపడి తీవ్ర అల్పపీడనంగా మారనుంది. అనంతరం దిశ మార్చుకుని పశ్చిమ వాయువ్య దిశగా ప్రయాణిస్తుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. 18వ తేదీన ఉదయం తమిళనాడు రాష్ట్రంలో తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించారు. దీని ప్రభావంతో మంగళవారం దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపారు. తీరం వెంబడి 30 నుంచి 35 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని.. దక్షిణ కోస్తా జిల్లాల్లోని మత్స్యకారులు ఈ నెల 18 వరకూ వేటకు వెళ్లవద్దని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

అమెరికాలో రోడ్డు ప్రమాదం.. తెనాలి యువతి దుర్మరణం

- రెండు రోజుల్లో ఎంఎస్ పట్టా చేతికి..
- అంతలోనే ప్రాణాలు విడిచిన నాగశ్రీ వందన పరిమళ



నాగశ్రీ వందన

తెనాలి : అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెనాలి యువతి నాగశ్రీ వందన పరిమళ(26) దుర్మరణం పాలైంది. సూరె గణేష్, రమాదేవి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. రెండో కుమార్తె నాగశ్రీ వందన పరిమళ. డేటా అనలటిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసేందుకు 2022లో అమెరికా వెళ్లి.. మెంఫిస్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసింది. సోమవారం జరిగే యూనివర్సిటీ కాన్వొకేషన్‌లో ఎంఎస్ పట్టా తీసుకుంటానన్న సంతోషంలో ఉంది. ఈ నేపథ్యంలో అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి ఎవరినో రిసీవ్ చేసుకునేందుకు స్నేహితులతో కలిసి కారులో బయలుదేరింది. అదే రోజు రాత్రి 2.30 గంటల సమయంలో ఆమె ప్రయాణిస్తున్న కారు రోడ్డుపై నిలిపి ఉండగా.. వేగంగా వస్తున్న ట్రక్ ఢీకొట్టింది. ప్రమాదంలో నాగశ్రీ వందన పరిమళ అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమాదం జరగడానికి అరగంట ముందు ఇంటికి ఫోను చేసి తల్లి రమాదేవితో మాట్లాడింది. ఆ తర్వాత కొద్దిసేపటికే రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం తల్లడిల్లిపోతోంది.

ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలి

- ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్
- వరంగల్ తరలిన అండర్–14 జట్టు



అండర్-14 జట్టుతో ఎండీసీఏ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హెచ్‌సీఏ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ అన్నారు. సోమవారం నుంచి హైదరాబాద్‌లో జరిగే హెచ్‌సీఏ అండర్–14 బాలుర స్కూల్ టోర్నమెంట్‌లో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టును ఆదివారం పిల్లలమర్రి సమీపంలోని క్రికెట్ మైదానంలో అభినందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ హెచ్‌సీఏ అండర్–14 టోర్నీలో గ్రూప్–బీలో మహబూబ్‌నగర్ జట్టు ఉన్నట్లు తెలిపారు. ప్రారంభం రోజు ఉమ్మడి జిల్లా జట్టు మొదటి మ్యాచ్‌ను సెయింట్ ఆంటోనీస్ హైస్కూల్–హిమాయత్‌నగర్ జట్టుతో తలపడనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా క్రీడాకారులు టోర్నీలో రాణించి హెచ్‌సీఎం రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, కోచ్ అబ్దుల్లా పాల్గొన్నారు.

అండర్-14 ఉమ్మడి జిల్లా జట్టు

జి.కేతన్, ఎ.హర్షిత్ (జడ్చర్ల), సాయిరామ్, హర్షిత్ (మహబూబ్‌నగర్), వెంకటసాయి, సుదేశ్, అర్హాన్ (గద్వాల), సృజన్ (మహబూబ్‌నగర్), సి.రాంచరణ్ (షాద్‌నగర్), డి.అఖిల్ (అచ్చంపేట), ఎండి.సోహెల్, ధనూష్ (మహబూబ్‌నగర్), హరివర్ధన్ (షాద్‌నగర్), జైచంద్ర (జడ్చర్ల), శ్రీమంత్‌రాజ్ (అచ్చంపేట).

ఉల్లం'ఘనులు'..!

జడ్చర్ల క్వారీల్లో భారీ అక్రమాలు



విచారణ చేపడుతున్న మైన్స్ అధికారులు (ఫైల్)

- మైన్స్ అధికారుల విచారణతో అక్రమాల గుట్టు రట్టు
- రెండింటికి రూ.55.42 కోట్ల జరిమానా
- ఎట్టకేలకు చర్యలకు పూనుకున్న అధికారులు
- కోర్టును ఆశ్రయిస్తున్న నిర్వాహకులు

జడ్చర్ల: నియోజకవర్గంలోని జడ్చర్ల, బాలానగర్, మిడ్జిల్ తదితర మండలాల్లోని క్వారీ నిర్వాహకులు ఏళ్లుగా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి తవ్వకాలు చేపడుతూ సర్కారు ఆదాయానికి గండి కొడుతున్నారు. తనిఖీల్లో అక్రమాలను గుర్తించిన అధికారులు నోటీసులతోనే సరిపెడతారా.. లేక ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని వసూలు చేసేందుకు చర్యలు చేపడుతారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో క్వారీ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వారికి ఉన్న రాజకీయ పలుకుబడి, పరిచయాలతో నిబంధనలను పక్కనబెట్టి అక్రమాలకు పాల్పడుతున్నారు. నిర్వాహకులకు కొందరు అధికారులు తమవంతుగా సహకరిస్తుండటంతో అక్రమాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

తనిఖీలతో వెలుగులోకి..

ఇటీవల రాష్ట్ర భూగర్భ గనులశాఖ అధికారులు జడ్చర్ల శివార్లలోని క్వారీలను తనిఖీ చేయగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా క్వారీలను కొల్లగొట్టడంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొట్టినట్లు గుర్తించి చర్యలకు దృష్టి సారించారు. క్వారీ నిర్వాహకులు ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించడం లేదని నిగ్గు తేల్చారు.

క్వారీల్లో తనిఖీలు..

జడ్చర్ల శివారులోని సర్వేనంబర్ 385/1లో హెక్టార్ క్వారీని శ్రీనివాస స్టోన్ క్రషర్ 15 ఏళ్లకు లీజుకు తీసుకుంది. లీజు అగ్రిమెంట్ 2021, మార్చి 21న ముగిసింది. ఆ సమయంలో తీసిన క్వారీకి సంబంధించి సీనరేజ్ రుసుం చెల్లింపులో అక్రమాలు చోటు చేసుకున్నట్లు అధికారులు తనిఖీల్లో గుర్తించారు. అదేవిధంగా సర్వేనంబర్ 28లో 4.58 హెక్టార్లలో భవాని స్టోన్ క్రషర్ ఆధ్వర్యంలో క్వారీ తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఈ క్వారీని తనిఖీ చేసిన అధికారులు భారీగా అక్రమాలు జరిగినట్లు గుర్తించి చర్యలకు ఉపక్రమించారు.

ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు.



క్వారీల నిర్వాహకులు నిబంధనలను ఉల్లంఘించి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారు. అధికారులు ఒత్తిళ్లకు తలొగ్గకుండా పారదర్శకంగా వ్యవహరించాలి. అక్రమార్కులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.

– అనిల్‌కుమార్, సామాజికవేత్త, జడ్చర్ల

జరిమానా వసూళ్లకు చర్యలు..

శ్రీనివాస స్టోన్ క్రషర్, భవాని స్టోన్ క్రషర్ యూనిట్లకు సుమారు రూ.55.42 కోట్ల జరిమానా విధించాం. నోటీసులకు స్పందించకపోవడం, జరిమానా చెల్లించకపోవడంతో భవాని స్టోన్‌క్రషర్ యూనిట్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేశాం. క్వారీల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని రాబట్టేలా చర్యలు తీసుకుంటాం.

– సంజయ్‌కుమార్, మైన్స్ ఏడీ, మహబూబ్‌నగర్

ప్రభుత్వ ఆదాయానికి గండి..

క్వారీ నిర్వాహకులు పర్మిట్ ఫీజు, డీఎంఎఫ్‌టీ, ఎస్ఎంఈటీ, ఇన్‌కం ట్యాక్స్ తదితర పన్నులు చెల్లించనున్నట్లు అధికారుల తనిఖీల్లో బయటపడింది. ఆయా పన్నులు చెల్లించకపోవడంతో ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లింది.

ఆధునిక విధానంలో సర్వేతో..

క్వారీ తవ్వకాల్లో నిబంధనలను అతిక్రమించినట్లు ఇటీవల తెలంగాణ రాష్ట్ర భూగర్భ గనులశాఖ అధికారుల బృందం తనిఖీల్లో బయటపడింది. క్వారీల కేటాయింపు విస్తీర్ణం తదితర వివరాల కోసం డీజీపీఎస్, ఈటీఎస్ సర్వే నిర్వహించారు. ఆధునిక విధానంలో సర్వే చేయడంతో సర్వే ఫలితాలు రావడంతో సర్కారు ఖజానాకు గండిపడినట్లుగా గుర్తించారు. శ్రీనివాస స్టోన్ క్రషర్ నిర్వాహకులకు రూ.21.13 కోట్లు, భవాని స్టోన్ క్రషర్ నిర్వాహకులకు రూ.34.39 కోట్లు జరిమానా విధించారు. ఆయా మొత్తాలను సంబంధిత ఖాతాలో జమ చేయాలని ఉత్తర్వుల్లో అధికారులు స్పష్టంగా పేర్కొన్నారు.

కోర్టును ఆశ్రయిస్తున్న నిర్వాహకులు..

మైన్స్ అధికారులు జారీ చేసిన జరిమానా నోటీసులపై క్వారీ నిర్వాహకులు కోర్టును ఆశ్రయిస్తున్నట్లు సమాచారం. ఇంతకు ముందు కూడా ఇలాంటి నోటీసులపై కోర్టుకెళ్లినట్లు తెలిసింది. కోర్టును ఆశ్రయించి కాలయాపన చేయాలన్న ఉద్దేశంతో ఉన్నారని సమాచారం.

ఆరు గ్యారంటీలపై షార్ట్ ఫిల్మ్



తెలకపల్లిలో షార్ట్ ఫిల్మ్‌ను చిత్రీకరిస్తున్న డైరెక్టర్

తెలకపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీలపై మండల కేంద్రంలో ఆదివారం షార్ట్ ఫిల్మ్ తీశారు. ఐజీపీఆర్ సూచన మేరకు తెలకపల్లిలో రెండు షార్ట్ ఫిల్మ్‌లను చిత్రీకరిస్తున్నారు. తెలకపల్లిలో రమాదేవి అనే మహిళా పిండి గిర్నితో ఉపాధి పొందింది. ఆమె వివరాలను సేకరించి, ఆమె జీవనోపాధిపైన చిత్రీకరించారు. గ్రామసంఘం మహిళలను సమావేశ పరిచి వారు తీసుకున్న రుణాలతో ఎలా లబ్ధి పొందారు. అభివృద్ధి ఎలా చెందారు అన్న విషయాలను చిత్రీకరిస్తున్నారు. ఆరు గ్యారెంటీలపై, వివిధ పథకాలను ప్రజల, మహిళల అభిప్రాయాలను తెలుసుకొని షార్ట్ ఫిల్మ్ రూపొందిస్తున్నారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య, అనిత, శారద, లక్ష్మణ్, చోటుమియా, ఫిల్మ్ డైరెక్టర్ రమణారెడ్డి, కెమెరామెన్ శివ, కో–డైరెక్టర్ శ్రీకాంత్, ఆపరేటర్ కృష్ణ ఉన్నారు.

ధర్మం, సంస్కృతి, శాస్త్రం బతికి ఉండాలి



సందేశమిస్తున్న ఆదిత్య పరాశ్రీస్వామి

జడ్చర్ల టౌన్: జీవరాశులు ఉన్నంత వరకు మన ధర్మం, శాస్త్రం, సంస్కృతి బతికి ఉండాలని.. అందుకు మనందరం మన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చాల్సిన అవసరం ఉందని బిజ్వారం అంబత్రయ క్షేత్రం పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీస్వామి అన్నారు. పుర పరిధిలోని 10వ వార్డులో ఇంటింటా 41 రోజుల హనుమాన్ చాలీసా పారాయణం ముగింపు కార్యక్రమం పోచమ్మ ఆలయం వద్ద నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆధునిక పోకడలతో మన ధర్మాలను మరిచిపోతున్నామని, ఇళ్లలో తల్లిదండ్రులు ఏ మార్గంలో పయనిస్తే పిల్లలు అదే మార్గంలో పయనిస్తారని గుర్తించాలన్నారు. భార్యాభర్తల నడుమ ఎన్ని అవరోధాలు, మనస్పర్థలు ఉన్నా సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని, రోజు ఉదయం సంధ్యవేళ అంటే 5 నుంచి 6లోపు తప్పనిసరిగా దీపారాధన చేయాలని సూచించారు. దైవారాధన, దీపారాధన చేయటంతో అనేక శుభ ఫలితాలు కలుగుతాయని, దీపారాధనలో మాతృమూర్తులే కీలకమన్నారు. అనేక మృత్యుంజయ హోమాలు చేసినా దక్కని ఫలితం ఉదయం దీపారాధనతో దక్కుతుందని చెప్పారు. సృష్టిలో దేనికి లేని విశిష్టత లలిత సహస్రనామాలకు ఉందని.. అమ్మవారి ఆదేశం ఉంటేనే పారాయణం చేయగలుగుతారన్నారు. నోములు, వ్రతాలు, పూజలు, దీపారాధన చేసే సమయంలో మహిళలు, పురుషులు సంప్రదాయ దుస్తులు, ఆభరణాలు మాత్రమే ధరించాలని, నుదుటిపై కుంకుమనే ధరించాలని కోరారు. ప్రపంచంలో ఏ క్షేత్రంలో లేని విధంగా తాము అంబత్రయ క్షేత్రం నిర్మించామని.. క్షేత్ర దర్శనంతోనే జన్మ ధన్యమవుతుందన్నారు. కార్యక్రమ అనంతరం నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మాతృశక్తి లావణ్య, శ్రీదేవి, రాధ, రమాదేవి, పోచమ్మ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీవాసులు పాల్గొన్నారు.

పంప్‌మోడ్ పద్ధతిలో 6,078 క్యూసెక్కుల నీరు తరలింపు

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో శ్రీశైలం ఆనకట్ట దిగువున సాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువున శ్రీశైలం జలాశయంలోకి ఇరవై నాలుగు గంటల వ్యవధిలో 6,078 క్యూసెక్కుల నీటిని (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,561, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకెఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 2.570 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. ఆదివారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 863.8 అడుగుల వద్ద 118.0544 టిఎంసీల నీటి నిల్వ ఉంది.

నిండుకుండలా రామన్‌పాడు జలాశయం..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడులో ఆదివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాలువ 510 క్యూసెక్కులు సమాంతర కాలువ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాలువ ద్వారా 750 క్యూసెక్కులు కుడి, ఎడమ కాలువ ద్వారా 35 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.